అర్ధంతరంగా నిలిచిన సైఫన్ నిర్మాణం

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో అన్నదాతలు



నల్లూర్ శివారులో అసంపూర్తిగా ఉన్న సైఫన్ నిర్మాణ పనులు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటి సరఫరా చేసే లక్ష్మి కాలువపై ముప్కాల్ మండలం నల్లూర్ గ్రామ శివారులో నిర్మిస్తున్న సైఫన్ నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. కాలువ ద్వారా ఖరీఫ్ సీజన్‌కు నీటి విడుదలను నిలిపి 10 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు పనులు పునః ప్రారంభం కాలేదు. దీంతో ఆయకట్టు రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువ అవతలి వైపున పంట భూముల్లో ఎక్కువ అయిన నీటిని ఇవతలి వైపు దాటించుట కోసం నిర్మించే వంతెననే సైఫన్ (సూపర్ పాస్) అంటారు. లక్ష్మి కాలువ ఆధునికీకరణ కోసం గత ప్రభుత్వం 2017లో రూ.20కోట్ల నిధులను మంజూరు చేసింది. ఇందులోభాగంగా కాలువపై సైఫన్ నిర్మాణం చేపట్టగా.. గత ఖరీఫ్ సీజన్‌కు ముందు కాంట్రాక్టర్ పనులను ప్రారంభించాడు. కానీ ప్రాజెక్ట్ నుంచి కాలువ ద్వారా నీటి విడుదల చేపట్టడం, భారీ వర్షాలు కురవడంతో పనులను మధ్యలోనే నిలిపివేశారు. ప్రస్తుతం నీటి విడుదలను ప్రాజెక్ట్ అధికారులు నిలిపి వేశారు. యాసంగి సీజన్‌కు నీటి విడుదల చేపట్టడానికి కనీసం నెల రోజుల గడువు ఉంటుంది. ఈ గడువు కాలంలో సైఫన్ నిర్మాణ పనులు చేపట్టవచ్చు. కానీ ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదు.

పాత ధరలతో చేయలేక..

కాలువ ఆధునికీకరణ పనులు 2017 నుంచి చేపడుతున్నారు. పనుల కోసం ఇప్పటి వరకు నలుగురు సబ్‌కాంట్రాక్టర్లు మారినా పనులు మాత్రం వేగవంతం కావడం లేదు. ఓ వైపు ముందుగా చేపట్టిన పనులు మళ్లీ మరమ్మతులకు వస్తున్నాయి. పాత ఎస్ఎల్ఆర్ ధరల ప్రకారం ఇప్పుడు పనులు చేపట్టడానికి కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడమే పనులు ముందుకు సాగకపోవడానికి కారణంగా తెలుస్తుంది. అధికారులు కాంట్రాక్ట్ దక్కించుకున్న కంపెనీని బ్లాక్‌లో పెడతామంటే మళ్లీ ప్రధాన కంపెనీ పనులు చేయుటకు ముందుకు వచ్చింది. కానీ పాత ధరల ప్రకారం చేయడానికి సిద్ధంగా లేనట్లు తెలిసింది. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి పనులను వెంటనే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

త్వరలో ప్రారంభిస్తాం..

లక్ష్మి కాలువపై సైఫన్ నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించాం. పనులను ప్రస్తుతం ప్రధాన కాంట్రాక్టర్ చేపట్టుటకు ముందుకు వచ్చాడు. త్వరలోనే పనులు ప్రారంభించి పూర్తి చేస్తాం.
– సురేశ్, డిప్యూటీఈఈ, మైనర్ ఇరిగేషన్, బాల్కొండ

ఆర్మూర్‌లో గ్రూప్-3 పరీక్షలు



ఆర్మూర్‌లోని నారాయణ పాఠశాల పరీక్ష కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు



ఆలస్యంగా రావడంతో పరీక్ష కేంద్రం బయటే నిలబడిన అభ్యర్థిని

ఆర్మూర్‌టౌన్: పట్టణంతో పాటు మున్సిపల్ పరిధిలోని పెర్కిట్, మామిడిపల్లిలో గల పరీక్ష కేంద్రాల్లో ఆదివారం గ్రూప్–3 పరీక్షలు ప్రశాంతంగా కొనసాగాయి. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో మొత్తం 12 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, నరేంద్ర డిగ్రీ, నరేంద్ర ఉమెన్స్, విజేత డిగ్రీ కళాశాలల్లో, నారాయణ, శ్రీ భాషిత, కృష్ణవేణి, సెంటయన్స్, సెంట్‌పాల్, శ్రీచైతన్య పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో అభ్యర్థులు పరీక్షలు రాశారు. కాగా సెంట్‌పాల్ పరీక్ష కేంద్రానికి ఇద్దరు అలస్యంగా రావడంతో లోనికి అనుమతి ఇవ్వలేదు. దీంతో వారు తిరిగి వెళ్లిపోయారు.

ఏఎస్సై సలీం సమయస్ఫూర్తి..

ఆర్మూర్‌లోని సెంట్‌పాల్ హైస్కూల్‌లో గ్రూప్–3 పరీక్ష రాయటానికి వచ్చిన ఓ మహిళ ఆమె కుమారుడిని వెంట తీసుకువచ్చింది. కాగ ఆమె కుటుంబ సభ్యుల సమయానికి రాకపోవడంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న ఏఎస్సై సలీం ఆమె కుమారుడిని తీసుకొని ఆ మహిళ పరీక్ష కేంద్రానికి వెళ్లే విధంగా చేశాడు. ఆమె కుటుంబ సభ్యులు వచ్చే వరకు కుమారుడిని జాగ్రత్తగా చూసుకొని, కుటుంబ సభ్యులు రాగానే వారికి బాబును అప్పగించాడు.



పరీక్షకేంద్రం వద్ద ఓ అభ్యర్థిని కుమారుడిని ఆడిస్తున్న ఏఎస్సై సలీం

క్లుప్తంగా

కాంగ్రెస్‌ను విమర్శించే అర్హత కేటీఆర్‌కు లేదు



ఆర్మూర్: కాంగ్రెస్ పార్టీ నాయకత్వాన్ని, ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత మాజీ మంత్రి కేటీఆర్‌కు లేదని టీపీసీసీ అధికార ప్రతినిధి ఏబీ శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ఆయన నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో నాయకులు మాట్లాడే భాషను బట్టి ప్రజల్లో గౌరవం పెరుగుతుంది. కానీ కేటీఆర్ భాష చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు కోలా వెంకటేష్, సాయిబాబగౌడ్, దూదిగాం ప్రమోద్, అజ్జు, హబీబ్, బట్టు శంకర్, అబ్దుల్ ఫయీమ్, ఫయాజ్, షేక్ పాషా, బాలకిషన్, రాజ్‌కుమార్ ఉన్నారు.

సమస్యలను పరిష్కరించాలి



పెర్కిట్: జేఈఈ మెయిన్స్ దరఖాస్తు సమస్యలను పరిష్కరించాలని వామపక్షాల విద్యార్థి సంఘం నాయకులు కోరారు. ఈమేరకు వారు ఆదివారం పెర్కిట్‌లో బీఆర్ఎస్ ఎంపీ కేఆర్ సురేష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆధార్, ఎస్సెస్సీలో వివరాలు తేడాగా ఉంటే దరఖాస్తు కావడం లేదని విన్నవించారు. సమస్యను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కరించే విధంగా కృషి చేస్తా ఎంపీ సురేష్‌రెడ్డి అన్నారు. నాయకులు నాగరాజు, షాహిద్, అగ్గు కాంత్రి, ఖాలేద్, ఇర్షాద్, అబ్రార్, అజయ్, తాజ్ పాల్గొన్నారు.

బడికి ప్రహరీ నిర్మించాలి




రుద్రూర్: కోటగిరిలోని మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఒక కోరుతున్నారు. బడికి ప్రహరీ లేనందున విద్యార్థులు విరామ సమయంలో ప్రధాన రహదారిపైకి వస్తున్నారని దీంతో ప్రమాదాలు జరిగే అస్కారం ఉందని వారు ఆందోళన చెందుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి ప్రహరీ నిర్మించి, బడిలోని సమస్యలను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



మోర్తాడ్: భీమ్‌గల్ మున్సిపల్ కౌన్సిలర్లు ఆదివారం బీఆర్ఎస్ పార్టీని వీడీ కాంగ్రెస్‌లో చేరారు. బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి ఆదివారం వారికి పార్టీ కండువాలు వేసి, కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కౌన్సిలర్లు సీహెచ్ గంగాధర్, బోర్ లింగం, వీడీసీ అధ్యక్షుడు చెవ్వ అశోక్, సహకార సంఘం డైరెక్టర్ దశగౌడ్, మాజీ సర్పంచ్ బాల గంగాధర్, కో అప్షన్ సభ్యుడ్ అహ్మదుల్లా, నాయకులు అక్రమ్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని మార్కండేయ మందిరం పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా టీవీఎస్ గంగాధర్, ఉపాధ్యక్షుడిగా భోగ సుదర్శన్, ప్రధాన కార్యదర్శిగా గుంటుక ఆంజనేయులు, కార్యదర్శిగా గణపురం రాజేశ్వర్, కోశాధికారిగా కడగుంట్ల గణేష్, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

దత్తాపూర్ లిఫ్ట్ కమిటీ..



డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని దత్తాపూర్ ఎత్తిపోతల పథకం కమిటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా వెంకటరమణ, వైస్ చైర్మన్‌గా మూడ రవీందర్, కోశాధికారిగా కొట్టె చిన్న భూమన్న, కార్యదర్శిగా జంగ్ల నాగరాజు ఎన్నికయ్యారు. ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని గ్రామస్తులు సన్మానించారు.

సంక్షిప్తం

ట్రస్మా రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీకి సన్మానం



రుద్రూర్: ప్రయివేటు పాఠశాలల రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ఎన్నికైన తెళ్ల రవికుమార్‌ను ఆదివారం కోటగిరిలో స్థానిక నాయకులు సన్మానించారు. నాయకులు నజీర్, వాజిద్, సోహెల్, నవీద్, ఇంతియాజ్,వహీద్ , రహీం, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

డోంగ్లి ఏవోకు..



ఎడపల్లి (బోధన్): మండలంలోని జానకంపేట్ గ్రామానికి చెందిన శివకుమార్ డోంగ్లి ఏవోగా ఎంపికయ్యారు. ఈసందర్భంగా ఆయనను జానకంపేట గ్రామస్తులు ఆదివారం సన్మానం చేశారు. జానకంపేట్ సొసైటీ చైర్మన్ మిద్దె నరేందర్ డైరెక్టర్లు, మాజీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం



ఎడపల్లి(బోధన్): మండలంలోని ఏఆర్పీ క్యాంప్ గ్రామంలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి వారి ఆధ్వర్యంలో గ్రామస్తులకు మొబైల్ స్క్రీనింగ్ వ్యాన్‌లో గ్రామస్తులకు కంటి పరీక్షలను నిర్వహించారు. క్లబ్ సభ్యులు సూర్యనారాయణ, గంగారెడ్డి, శంకర్, కదం ప్రకాష్ రావు, కాశీనాథ్ పాల్గొన్నారు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



మోర్తాడ్/ఎడపల్లి: ఏర్గట్లలో పలువురు బాధితులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పంపిణీ చేశారు. ఎడపల్లి మండలంలోని జానకంపేటలో పలు బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు.



ఎల్‌వోసీ అందజేత



కమ్మర్‌పల్లి: మండల కేంద్రానికి చెందిన సౌందర్యకు వైద్య చికిత్స కోసం రూ. 2.50 లక్షల ఎల్‌వోసీని ఆదివారం ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఆమె కుటుంబానికి అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబానికి చేయూత



వేల్పూర్: మండలంలోని పడగల్ గ్రామానికి చెందిన అఫ్తాబ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్య చికిత్స కోసం ఆదివారం హెల్పింగ్‌హాండ్స్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు రూ.5500 ఆర్థిక సహాయం

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



బోధన్‌రూరల్: మండలంలోని కల్దుర్కి గ్రామంలో కురుమ కులస్తుల ఆరాధ్యదైవం బీరప్ప ఆలయ నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. అనంతరం స్థల దాత సంబాజీ నీలకంఠ విజయ్ కుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు, సభ్యులు, కులస్తులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో 64శాతం సర్వే పూర్తి

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని 36 వార్డులో సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే ప్రశాంతంగా కొనసాగతుంది. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో ఇప్పటి వరకు 20,149 కుంటుబాలకుగాను 12,916 కుటుంబాలను సర్వే చేయగా, 64.2శాతం పూర్తయిందని మున్సిపల్ కమిషనర్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్యుమరేటర్లను 159 బ్లాక్‌లుగా విభజించి, 14మంది సూపర్‌వైజర్ సమక్షంలో ప్రతిరోజు సర్వే కొనసాగుతుందన్నారు. ఎన్యుమరేటర్లు రోజుకు 10 నుంచి 12 వరకు కుటుంబాలను సర్వే చేస్తున్నారన్నారు. ఇప్పటి వరకు ఒక్కరోజు కూడా సెలవు లేకుండా సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. అతి త్వరలోనే ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సర్వే పూర్తి చేయనున్నట్లు తెలిపారు..



ఆర్మూర్‌లో సర్వే చేపడుతున్న సిబ్బంది (ఫైల్)

వివరాలు సరిగా ఇవ్వని ప్రజలు..

ఆర్మూర్ పట్టణంలో సమగ్ర సర్వేకు ప్రజలు సహకరించడం లేదని తెలుస్తుంది. సర్వేకు సంబంధించిన పలు వివరాలు అడిగితే ఆ వివరాలు మీకెందుకు అని అధికారులకు ఎదురు ప్రశ్న వేస్తున్నారు. అయినా అధికారులు వారిని సముదాయించి వారి వద్ద వివరాలు సేకరించేందుకు కృషి చేస్తున్నారు. ఈ సర్వేపై సూపర్‌వైజర్లను ఏర్పాటు చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో వారి పర్యటన సరిగా లేదు. దీంతో తమ పరిస్థితిని ఎవరికీ చెప్పుకోలేని విధంగా ఉందని ఓ ఎన్యుమరేటర్ వాపోయాడు. ఇప్పటికైనా అధికారులు కుటుంబ సర్వేపై అవగాహన కల్పించి వివరాలు అందించేలా చూస్తే బాగుంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలు సహకరించాలి..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలి. సర్వే సిబ్బంది ఇళ్లకు వచ్చినపుడు ఆధార్, రేషన్, ధరణి పాసుపుస్తకంతోపాటు ఇతర వివరాలు అందుబాటులో ఉంచుకొని తెలియజేయాలి.
– రాజు, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

అపోహలు వద్దు..

సమగ్ర కుటుంబ సర్వేపై ప్రజలు ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దు. ప్రభుత్వం చేపడుతున్న సర్వే ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుంది. ఎన్యుమరేటర్లు అడిగిన సమాచారంను ప్రజలు అందించి, సహకరించాలి.
– వన్నెల్‌దేవి లావణ్య, మున్సిపల్ చైర్‌పర్సన్, ఆర్మూర్

సకాలంలో సర్వేను పూర్తి చేయాలి



రెంజల్‌లో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో

రెంజల్(బోధన్): సమగ్ర ఇంటింటి సర్వేను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్ సూచించారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్‌లకు పలు సూచనలు అందించారు. ఒకే ఇంటి వద్ద కాకుండా ప్రతీ ఇంటికి వెళ్లాలని పేర్కొన్నారు. సోమవారం వరకు సర్వేను పూర్తి చేయాలని సూచించారు.

మానవత సదన్‌లో వైద్యశిబిరం



డిచ్‌పల్లి: మండలకేంద్రంలోని మానవత సదన్‌లో ఆదివారం ఇన్నర్ వీల్ క్లబ్ నిజామాబాద్, ఇందూర్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా పిల్లలకు వ్యాక్సిన్‌ను వైద్యురాలు బండారు ఉషా అందజేశారు. చైర్‌పర్సన్ ప్రేమలత, ప్రెసిడెంట్ మమత గుప్తా, మిట్టల్, వైష్ణవి వ్యాక్సిన్లను అందించినట్లు తెలిపారు. కేర్ టేకర్ రమేష్, క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సునీత జైన్, తేజస్విని, కవిత అగర్వాల్, సదన్ సిబ్బంది పాల్గొన్నారు.

బీడీ కార్మికుల సంక్షేమానికి కృషి



నిజామాబాద్ సిటీ: బీడీ కార్మికుల సంక్షేమం కోసం ఏఐటీయూసీ రాష్ట్ర బీడీ వర్కర్స్ ఫెడరేషన్ నిరంతరం కృషిచేస్తుందని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో ఆదివారం జిల్లా ప్రథమ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలరాజ్ మాట్లాడుతూ.. కేంద్రం బీడీ పరిశ్రమను నిర్వీర్యం చేయడానికే సిగరెట్, గుట్కాలను ప్రోత్రహిస్తుందన్నారు. ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. నాయకులు గోవర్ధన్, రాములు, ఓమయ్య, ముత్రం, నర్సింగరావు, భానుచందర్, చక్రపాణి, హనుమాన్లు, రాధాకుమార్, మహేష్, అలీ ఇమ్రాన్, గంగాధర్‌లు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

■ 20న గంగా హారతి



నందిపేట్ (ఆర్మూర్): మండలంలోని ఉమ్మెడ శివారులోగల గోదావరి నది తీరాన ఈనెల 20న బుధవారం గంగా హారతి నిర్వహించనున్నట్లు కేదారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకుడు మంగి రాములు మహారాజ్ తెలిపారు. ఈమేరకు ఆదివారం మండల కేంద్రంలో గంగా హారతి పోస్టర్లను ఆవిష్కరించారు. మంగిరాములు మాట్లాడుతూ.. సనాతన ధర్మాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని సూచించారు. హారతి కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. మాజీ సర్పంచ్ రామడ పోశెట్టి, మాజీ ఎంపీటీసీలు మనోజ్ రావు, దూడ వెంకటేష్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

■ నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీసేవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

■ సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలోగల హనుమాన్ ఆలయంలో శనివారం ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సామూహిక హనుమాన్ చాలీసా అమృత స్వర్ణోత్సవాల పారాయణం నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ, కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

■ ఘనంగా బోనాల పండుగ

రెంజల్(బోధన్): ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం రెంజల్ గ్రామంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో బోనాలను ఊరేగింపు నిర్వహించి, అమ్మవారికి సమర్పించారు. మాజీ సర్పంచ్ రమేష్‌కుమార్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



■ భక్తిశ్రద్ధలతో పోచమ్మ పండుగ

వర్ని: మోస్రా మండలం గోవూరు గ్రామంలో ఆదివారం ఆదివాసి నాయక్‌పోడ్ సంఘం ఆధ్వర్యంలో బద్దిపోచమ్మ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బోనాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి సమర్పించి, పూజలు చేశారు.



■ నగరంలో బోనాల పండుగ

నిజామాబాద్‌నాగారం: నగరంలోని కోటగల్లి మాల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలు బోనాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి అమ్మవార్లకు సమర్పించారు. కోటగల్లి మాలసంఘం అధ్యక్షుడు సక్కి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి సాదు అనిల్, తదితరులు పాల్గొన్నారు.


■ వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు





రుద్రూర్: కోటగిరిలో నూతనంగా నిర్మించిన హరిహర పుత్ర అయ్యప్పస్వామి– సాయిబాబా ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం వేద పండితులు వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో మహా సుదర్శన హోమం, మహా చండీహోమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, గురుస్వామి చంద్రమౌళి హాజరై పూజలు చేశారు. ఆలయ కమిటి ఆధ్వర్యంలో భక్తుల కోసం అన్నదానం ఏర్పాటు చేశారు. సోమవారం యంత్ర విగ్రహ ప్రతిష్ఠ, మహా కుంబాభిషేకం, తొలి పడిపూజ, పుష్పాభిషేకం ఉంటుందని ఆలయ కమిటి సభ్యులు వివరించారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1 –	మట్కా(తెలుగు) -9.40 లక్కీ భాస్కర్ (తెలుగు) - 1.05 7.35 - క (తెలుగు) -4.20 అమరన్(తెలుగు) - 10.50
స్క్రీన్-2 –	డమ్మీ మూవీస్ -3.00 5.30 8.00 10.30
స్క్రీన్-3 –	కంగువ (తెలుగు)-12.00 3.20 6.40 10.00
స్క్రీన్-4 –	అమరన్(తెలుగు)-11.30 మట్కా(తెలుగు)-3.00.6.25.9.50

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	మట్కా (తెలుగు)-10.25.4.35. 10.40 లక్కీ భాస్కర్(తెలుగు)-1.40.7.35
స్క్రీన్-3	అమరన్(తెలుగు)-1.25 7.25

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	కంగువ 3డీ (తెలుగు)-9.30.12.50. 4.10.7.30.10.50
స్క్రీన్-2	మట్కా(తెలుగు)-12.10.3.35.7.00. 10.25
స్క్రీన్-3	అమరన్(తెలుగు)- 9.50 సింగం అగైన్ (హిందీ)-1.20 లక్కీ భాస్కర్ -4.30.7.45.11.00
స్క్రీన్ -4	భూల్ భులయ్యా (హిందీ)=12.35 క(తెలుగు)-4.00 అమరన్(తెలుగు)-7.15 10.45
లలితామహల్	దేవర పార్ట్-1 (తెలుగు)
దేవి	మట్కా (తెలుగు)
నటరాజ్	అమరన్ (తెలుగు)
విజయ్	కంగువ 3డీ (తెలుగు)

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	77,100	వెండి(కిలో)	93,000
22 క్యారెట్స్	71,132		

– నిజామాబాద్ బిజినెస్